


# వసంత రాగోదయం

ఉమాదేవి

కథానిక

మళ్ళా ఓసారి అదేవిధంగా తలుపుతట్టటం విని—

"ఎన్నిసార్లు చెప్పాను ఆఫీసు వర్కు చేసుకుంటున్నప్పుడు డిస్టర్బు చేయనీయొద్దని—యీ గోపిగాడికి బుద్ధిఉండేడిస్తేగా!" అని విసుక్కుంటూ లేచి వెళ్ళింది శకుంతల.

అంత విసురుగానే తలుపుతీసింది.

తీస్తూనే తలుపుతట్టిన మనిషిని చూపుల్తో నమిలి మింగేయాలనుకుంటూ తల ఎత్తింది. ఎదురుగుండా నవ్వుతూ నిల్చున్న వ్యక్తిని చూసి ఆశ్చర్యం—సంతోషం — సంభ్రమాల మిశ్రమం అయి ఊరుకుంది శకుంతల.

ఒక్కఉదుటున ఆ వ్యక్తిని కౌగలించుకున్నంత పనిచేస్తూ—

"ఓసీ-నువ్వటే వసంతా! గోపీగాడనుకున్నాను. ఉన్నట్టుండి ఒక్కసారి ఎలా ఊడిపడ్డావు? సెలవలిస్తే ముందు రాసేదానివిగా. ఏమంత అర్జంటు పని మీద ఒక్క ముక్కన్నా రాయకుండా దిగబడ్డావు? ఒకవేళ పిల్లల్నిగాని ఎక్స్‌కర్షనుకు తీసుకుపోతూ యిటు వచ్చావా?" అని ప్రశ్నల వర్షం ఏకబిగిన కురిపించేసింది.

వేటికీ ప్రత్యేకించి జవాబు చెప్పలేదు వసంత. అన్నిటికీ సమాధానం ఆ చిరునవ్వే.

"ఏమిటే మొద్దూ—మాటా పలుకూ లేకండా బొమ్మలా ఆ కూర్చోవటం—పెళ్ళికాకుండానే మూగనోము పట్టావేమిటి? జవాబుచెప్పవేం ఒక్కదానికీ?" అంది మళ్ళీ శకుంతల.

"వేటికని చెప్పమంటావు? నువ్వు ఊపిరాడనిస్తేగా ప్రశ్నల వర్షంతో!" అంది, అదే చిరునవ్వు నవ్వుతూ కొద్దిపాటి మందలింపు స్వరంతో.

"నీ యిష్టంవచ్చిన ప్రశ్నకే ముందు జవాబు చెప్పు తల్లీ!" అంటూ లోపలికి వెళ్ళి బిస్కెట్ల పొట్లాం తెచ్చి ముందుపడేసింది.

"ఎక్స్‌కర్షనుకా అని అడిగావు కదూ—అదయినా కనీసం పదిరోజులు ముందయినా సంకల్పించుకోవాలిగదా! మా క్లైంట్సనుకున్నావా నీ యిష్టంవచ్చినప్పుడల్లా రమ్మని పురమాయించి తిప్పటానికి? పిల్లలు ఎంతటి పేచీకోరులో—అందులో పల్లెటూరి పిల్లల్ని ఎక్స్‌కర్షనుకంటూ తరలించటం ఎంత అవస్థో అసలు నీకేమన్నా ఐడియా ఉందటే?" అంటూ బిస్కెట్ పొట్లాం విప్పింది వసంత.

"పోనీవే అమ్మా—మరేలా యీ లీల ఆకస్మికంగా ఏతెంచావో అంటున్నా. ... చెప్పగూడని విశేషంగాని మరే రహస్యమయిన స్వంత పనులుగాని ఉన్నాయా?" అంది అలవోకగా, తెల్లని ముఖంలో నీలి నేత్రాలు తళుకు లీనుతుంటే—గడుసుగా తల, కనుబొమలు ఎగురవేస్తూ.

"నీ తుంటరి ప్రశ్నలు పోనియ్యవు గదా! నీకు తెలియరాని రహస్యాలు నాకేవీ ఉండవని నీకు మాత్రం తెలీదూ? పోనీ క్రాస్ఎగ్జామిను చేయరాదూ కోర్టులో? అలా చేయటం నీకు అలవాటే కదూ?"

"ఇదుగో వసంతా! చెప్పటం యిష్టంలేకపోతే అలాగని సూటిగా చెప్పేయరాదుటే-యీ డొంకతిరుగుడు సమాధానాలతో వేధించకపోతే!" అంది తెచ్చికోలు చిరుకోపంతో శకుంతల. ఆమె విశాల

నేత్రాలలో ఇంద్ర ధనుస్సుల ఛాయలు లీలగా తోచాయి వసంతకు.

"ఛా, యీమాత్రానికే యింతగా యిదయిపోతే యెలాగే శకూ? ఏదో ఊహించలేకపోతావా అనుకున్నానుగాని..." అంది వసంత మెల్లిగా శకుంతలపక్కకు జరిగి.

"నేను ఊహించపోలేదుగాని—అదవునో కాదో అని సందేహించాను." అంది చిరునవ్వుతో శకుంతల.

"అయితే అతగాడేం చేస్తున్నాడేమిటి? ఏం చదివాడు? ఎంతాస్తి ఉంది?"

"నా సంగతి తరువాత చెప్తానుగా. ముందు నీ సంగతి చెబుదూ-ఏవయినా సంబంధాలొచ్చాయా యిటీవల?" అంది కుతూహలంతో వసంత.

"ఆహా—నిన్ననే ఒకారువచ్చి వెళ్ళారు. రేపొకరు రాపోతున్నారు."

"ఏం నిన్న వచ్చిందెవరేమిటి? నచ్చలేదా?"

"ఒక జూనియర్ ఇంజనీరు. పేపరులో ఎడ్వర్టయిజు చేస్తే మా నాన్నగారు జవాబు వ్రాశారు. అతనికంటే వెంటవచ్చిన రెండో అతనే బావున్నాడు నాకు. ఇతడు నాకంటే పొట్టేమో ననిపిస్తుంది. పైగా పిల్లికళ్ళు...వాళ్ళకు నచ్చినా నాకు నచ్చలేదనే చెప్పాలనుకుంటున్నాను..."

"పిల్లికళ్ళా! అంటే ఏమిటి?...అతనెక్కడ ఉద్యోగం చేస్తున్నాడు?"

"రాజమండ్రిలో."

"పేరు...?"

"శ్రీనివాసరావో — ఏదోఉందిలే."

వసంత ఎందుకో కాస్త చలించినట్లయింది. ఎటో చూస్తూ ఊరుకుంది. ఇటు శకుంతల చెప్పుకు పోతోంది.

"నాన్నగారికి అన్నిట్లోనూ పట్టుదలేనని నీకూ తెలుసుగా. ఆయనకు అటు కుర్రవాడి అందచందాలూ, ఇటు చదువూ ఉద్యోగం—అటు ఆస్తి పాస్తులూకూడా నచ్చాలి. ఆవిధంగాచూస్తే యితనికి ఆచదువూ ఉద్యోగం మినహాయిస్తే మరెదునా ఆయనకు నచ్చినట్లే ఉంది. వాళ్ళటు గడప దాటగానే—నా కంటిముందే "ఇతనికి పిల్లికళ్లులా ఉన్నాయే బేబీ" అన్నారు. పైగా అతనికి ఆస్తి కూడా ఏమీలేదట—వాళ్ళ తరువాత జవాబు వ్రాస్తామన్నారుగాని మావైపునుండి విరమించుకున్నట్లే..." అంది శకుంతల.

"ఇక నీ సంగతిచెప్పు" అని అడిగింది.

వసంత తలవంచుకుని "సరే దాపరికం దేనికీ—నిన్ను చూడటానికి వచ్చినవారే నన్ను చూడటానికీ వచ్చారు. మా నాన్న పేపరులో చూచే జవాబు వ్రాశారట. రాత్రికిరాత్రి అన్నయొచ్చి నన్ను వెంటబెట్టుకుని తీసుకొచ్చాడు."

"అయ్యొయ్యొ వసంతా పొరపాటున యిందాకటి నుంచీ ఏవో అనేశానే అతణ్ణిగురించి! ఏమీ అనుకోకే—యింతకీ నచ్చాడా నీకు?"

వసంత చామనచాయ బుగ్గలో వ్యాపించిన లజ్జారుణిమ ఏమంతగా పైకి కనిపించలేదు.

"ఊఁ—మా యింట్లో అందరికీ నచ్చాడు... నేనుగూడా నా అంగీకారం తెలిపేశాను." అంది తలవంచుకునే.

"అయ్యో క్షమించవే వసంతా! ఇతడే నిన్ను చూట్టానికి వచ్చాడేమోనని ఏమూలో అనుమానించినా గట్టిగా నమ్మలేక పోయాను. అయినా తొందరపడి ఒప్పుకున్నావేమో! మనం చదువుకునే రోజుల్లో నీవేమనేదానివో గుర్తుందా...?"

వసంతకు గుర్తులేక పోలేదు. ఎప్పుడూ... హాయిగా ఊరిబయట సముద్రం ఒడ్డున ప్రశాంతమైన తోటలో ఓ చిన్నడాబా, బీరువాలనిండా అన్ని రకరకాల, ఖరీదైన చీరలూ, పెద్ద లైబ్రరీ, ఇంట్లో అన్ని వసతులూ, ఆనందంగా సరదాగా చదువుకుంటూ రాసుకుంటూ ఆడుకుంటూ పాడుకుంటూ కాలక్షేపం చేయటానికి అన్ని హంగులూ ఉండి... తన అభిరుచులతో ఏకీభవించే సుందరుడు భర్త అయితే...స్వంతకారులో తలుచుకున్నప్పుడల్లా షికార్లు కొడుతూ ఉండాలి...అనేది...

"ఊరిబైట ఉంటే భయంవేయదుటే?" అని ఒక భీతహరిణేక్షణ భయపెట్టేది.

"సముద్రం ఒడ్డునే అయితే అది పొంగి ఇంటిని ముంచితేనో" అని మరో జవ్వని జడిపించేది.

"అయితే ఎప్పుడూ ఆయనగారిని ఎదురుగుండా కూర్చో పెట్టుకుంటావన్న మాట." అని మరో ముద్దరాలు మురిపించేది.

అయితే ఒక్క వసంతకేకాదు అలాంటి కోరికలుండేది—చాలావరకూ కన్యలందరూ అలాంటి

సుందర సుమధుర స్వప్నాలలోనే తేలిపోతారు... అయితే బయట ప్రపంచంలోని కఠోరవాస్తవికతలను అర్థంచేసుకోటం మొదలెట్టాక ఆశలు వాటంతటవి మంచులా కరిగిపోక తప్పదు—లేకపోతే బాధపడేదీ వాళ్ళే...!

"...గుర్తున్నాయి శకూ—అయితే అవి తీరేవి కావని నాకు తెలుసు — తీరలేదని దిగులూ లేదు...మానసికంగా అలా ఊహించుకుని చెప్పుకోవటంలో తాత్కాలికమైన తృప్తిని అనుభవించానని ఒప్పుకోటానికి నేనేమీ సిగ్గుపడను. అయితే అవి పదహారు పదిహేడేళ్ళున్నప్పుడు చెప్పిన కబుర్లు. ఇప్పుడో— యిరవైయేళ్ళు దాటిపోయాయి. వెనకాల యిద్దరు చెల్లెళ్ళున్నారింకా—అన్నయ్య చదువు ముగియాలి—తమ్ముడు యీయేడే యింజనీరింగులో చేరాడు. నాన్నేమో నాకోసం కట్నాలు పోయలేదు—అందుకే భగవంతుడు చూపినదానితోనే తృప్తిపడ దలచుకున్నాను."

"పోలి అనా స్వీట్ లెమన్ సిద్ధాంతమా?" అంది శకుంతల నవ్వుతూ.

"కాదు శకూ! నాన్న అక్కడికీ అడిగాడు—'మాకోసం తొందరపడి ఒప్పుకోవద్దమ్మా—యింకా నాలుగురోజులు వెతికి యింకా మంచి సంబంధం తేవటానికి ప్రయత్నిస్తా'— అని. కాని అనవసరం అనిపించింది. నేను ముఖ్యంగా చూసింది చదువు—పైగా అతని వైఖరీ అదీ చూస్తే బుద్ధిమంతుడిలాగా తోచాడు. ఎదుటివ్యక్తి కష్టసుఖాలు గుర్తెరిగి హృదయాన్ని తెలుసుకుని ప్రేమించగలవ్యక్తి కావాలిగాని డబ్బులో మునిగి తేలుతూ రూపాయలతో విలువకట్టే వ్యక్తులతో సుఖపడలేమేమోననిపించింది శకూ—"

"ద్రాక్షపళ్లు పులుపు అనుకుందిట—"

"...నీకు నవ్వే రావచ్చు—ఏమైనా అనుకో—కాని నా నిశ్చితాభిప్రాయమే అది...అయినా నేను మటుకు ఏమంత సౌందర్యవతిననీ? యీ నల్లపిల్లని చేసుకునేందుకు యెవరు యిష్టపడతారు చెప్పు? ఎందుకోగాని ఇతన్ని చేసుకుంటే సుఖపడతాననిపించింది. ఒప్పేసుకున్నాను. ఆ స్తిసంగతంటావా మాకుమాత్రం మేముంది? దేవుడిచ్చిన ఆయురారోగ్యాలు తిన్నగా ఉంటే సంపాదించుకోలేమూ? నే నెలాగూ ఉద్యోగం చేస్తున్నదాన్నేగా — యింకేం కావాలి? అయినా నువ్వే చెప్పు శకూ— నాకు తగడంటావా అతను?"

"అహా—బాగానే ఉంటాడులే..." అంది సందేహిస్తూ శకుంతల.

ఇంత మాట్లాడుతున్నా వసంత మనసులో పిల్లికళ్ళు అన్నమాటే పదేపదే మెసులుతోంది— అంటే ఏమిటో!

"పిల్లికళ్ళన్నావేమిటే శకూ—ఎలా ఉంటాయి?"

"ఏమీలేదే—నేనూ సరిగా చూడలేదు. కనుచీకటి పడే వేళకదూ, ఒక్కసారి యథాలాపంగా అటు చూసేసరికి అతడూ యిటు చూశాడు. ఏమిటో తెల్లగా ఉన్నట్లు కనిపించాయి...ఐనా బాగానే ఉన్నాయేమో! నా మాట పట్టుకు కూర్చోకు" అంది శకుంతల.

"ఆ— అదేంలేదులే— మరి వెళ్ళొస్తానే. వీలైతే సాయంత్రం సినిమాకు వెళ్దాం మాయింటికి రా" అంటూనే వసంత వెళ్ళిపోయింది.

• • •

వస్తూనే "అమ్మా-పిల్లికళ్ళంటే ఎలా ఉంటాయే" అంది తల్లితో.

"ఇప్పుడెందుకుటా ఆ జిజ్ఞాస?" అంది మేనత్త.

"ఏంలేదుగాని పగలు వచ్చిన పెళ్ళికొడుకు కళ్ళు ఎలా ఉన్నాయే?" అంది తల్లిని.

"ఆ అబ్బాయి కళ్ళకేం సిత్కేపంలా ఉంటే— నీ కంటే బాగానే ఉన్నాడు దొరబాబులా-పిల్లికళ్ళన్నారా యేం ఎవరన్నా?"

"అయినా పక్క అరగంట సేపు ఎదురుగుండానే కూర్చున్నావుగా చూడలేదా?" అంది మేనత్త వెక్కిరింపుగా.

"కొత్తమనిషిని కళ్ళల్లో కళ్ళుపెట్టి చూడమంటావా? ఐనా యిన్ని రకాలుంటాయని నేనే మెరుగుదును? అసలు పిల్లికళ్ళంటే ఎలా ఉంటాయి?" అంది మళ్ళీ వసంత-బుంగమూతి పెట్టి.

"ఏం నంగనాచివే నా తల్లీ-బి. యే. చదివావు పిల్లికళ్ళెలా వుంటాయో తెలీదూ?" అంది అత్త.

"తెల్లగా ఉంటాయి నల్లగుడ్లు; అతనికేం పిల్లికళ్లు కాదు. నే చూచాగా" అంటూ సర్ది చెప్పింది తల్లి.

"ఇంకా సందేహం తీరకపోతే పిల్లిదగ్గరకు పోయి చూడరాదుటే కోడలా!"

పిల్లి ఓపట్టాన చిక్కుతుందా కళ్లు పరీక్షించటానికి?

అక్కడికీ నానా అవస్థాపడి పిల్లికి కాస్త దూరంలో కూర్చుంది. అసలు వసంత పట్టి పిరికిది; చిన్నప్పటినుంచీ కూడా కుక్కా పిల్లీలాంటి జంతుజాల మంటే తగని భయం. దగ్గరగా వెళ్తే పిల్లి పట్టుకుని కళ్లు పీకుతుందని దూరంనుంచే జాగ్రతగా చూసింది. పిల్లి కళ్లు ఆకుపచ్చగా తెల్లతెల్లగా అసహ్యంగా కనిపించాయి.

ఈ గొడవలో ఉండగానే తండ్రీ అన్నగారూ లోపలికి వచ్చారు. మూల మూలి ముడుచుకుని అత్యంతాసక్తితో పిల్లి కెదురుగుండా కూర్చున్న వసంతని చూసి—

"ఏమేవ్. మన పిరికిపిల్ల పిల్లితో ఆటలు మొదలు పెట్టిందెప్పణ్ణుంచీ?" అన్నాడు తండ్రి అట్టహాసం చేస్తూ.

"ఆటకాదు-నా బొందా కాదు. పెళ్ళికొడుక్కి పిల్లికళ్ళని చెప్పిందిట స్నేహితురాలు. అది పట్టుకుని పిల్లికళ్ళంటే ఎలా ఉండాయోనని పిల్లిదగ్గర చేరింది చూట్టానికి" అని ఫిర్యాదు చేసింది తల్లి చేతులు తప్పకుంటూ. "బాగుంది వరస. నావి పిల్లి కళ్ళేమో యిటు చూసి చెప్పు వసంతా? కనుగుడ్లు తేనెరంగులో ఉంటే పిల్లికళ్ళంటారు. అలా అయితే నీవీ అవే మీ అమ్మవీ అవే అన్నవీ చెల్లివీ కూడా అవేగా! ఒకవేళ పిల్లికళ్లే అనుకుందాం కాసేపు. అన్నివిధాలా నచ్చి తథాస్తు అనుకున్న సంబంధం అబ్బాయి కళ్ళు తెల్లగా ఉన్నాయని మానుకుంటామా? రంగు తెలుపై లేమటుకు దృష్టిలో దోషం ఏదీ లేదుగా...!"

ఆ! అయితే పిల్లికళ్లే నన్నమాట. ఇక ముందు ముందు పుట్టబోయే పిల్లలకు గూడా అలాగే పిల్లి కళ్ళువచ్చి బుల్లిబుల్లి పిల్లి కూనల్లా పుట్టుకొస్తారు కాబోలు మ్యావ్ మ్యావ్ అంటూ. అమ్మో! ఆ ఊహవచ్చి భరించలేక వసంత కళ్ళు గట్టిగా మూసుకుంది వణికిపోతూ—

"నా మాట నమ్ముతావా చెల్లీ నేను దగ్గరగా బాగా చూశాను. అతనికళ్ళు చక్కగా ఉన్నాయి. తరువాత నువ్వే అంటావుగా నా మాట నిజమని" అన్నాడు అన్న.

"అచ్చు—యింగ్లీషువాడిలా ఉన్నాడొదినా-నీ కంటే తెల్లగా బాగున్నాడు" అన్నాడు అత్త కొడుకు వేణు.

* * *

పెళ్ళిపీటలమీద కూర్చున్న వసంత తెర తీయగానే నలుగురూ పెళ్ళికూతుర్నే గమనిస్తూ ఉంటారని తెలిసినా తాను చూస్తే నవ్వి ఏడిపిస్తారని గ్రహించినా కుతూహలం పట్టలేక కాటుకళ్లెత్తి పెళ్ళికొడుకు కళ్ళలోకి నల్భై అయిదు డిగ్రీల ఊర్ధ్వకోణం చేస్తూ చూచింది. ఆశ్చర్యపోయింది!

ఛా—వీటిని పిల్లికళ్ళని ఎవరనగలరు? భవిష్యత్తులో తా నియ్యబోయే సౌఖ్యాన్ని ఏష్యూర్ చేస్తూ అనంతమైన ప్రేమనీ యిముడ్చుకుని దయతో తన వైపే చూస్తున్న ఆ నేత్రాలలో అందంలేదంటే ఎలా ఒప్పుకుంటుంది? తనని సమ్మోహన పరచి వివశురాల్ని చేసే ఆ చిరునవ్వ కంటే విలువైన ఆస్తి మరింకేం కావాలి తనకు? గుణసుందరి పెళ్ళిపీటలమీద భర్త నిజమైన్న చెయ్యి చూచి ఎలా కంగారుగా సంతృప్తిగా కంకణం కట్టిందో అలాగే వసంతకూడా సంతోషంతో సంతృప్తిగా అతనికేసి ఒకసారి చూసి బుద్ధిమంతురాలిగా తలవంచుకుని కూర్చుంది.

---

'రేపు' అనేది లేకపోతే మానవ జీవితం ఎంత దుర్భరంగా, శోభాదరిద్రంగా ఉండి ఉండేదో! 'నిన్న' అనేది చక్కగానే గడిచిపోయి ఉండొచ్చు, నిన్నటి సంఘటనలు నెమరువేసుకుంటే మధురంగానే ఉండొచ్చు, కాని 'నిన్న' గడిచిపోయింది, యింక తిరిగి రాదు. 'నేడు' అనేది సరే ప్రతి నిముషం మనల్ని పీడిస్తోనే ఉంది: ప్రతి 'నేడూ' అసహ్యంగానే ఉంటుంది. కాని 'రేపు' ఉందే, ఆహా, అది స్వప్నాలు కనే వారి స్వర్గసీమ; 'రేపు'లో అసంభవం ఐన దేదీ ఉండదు, దొరకని ఆనందం అంటూ ఉండదు.—(మార్క్స్)